26

# వైరాగ్యమూర్తి శ్రీ శేషుదేవులు

1972లో సత్సంగము ప్రారంభమైన తరువాత శ్రీ శేషుబాబుగారి ప్రవర్తన పూర్తిగా మారిపోయినది. తన ప్రియ శిష్యునితో కలసి ఎల్లవేళలా సత్యచింతనయందు సత్యబోధలోను నిమగ్నమైపోయియుండేవారు. రోజులో ఎక్కువ కాలము ఇద్దరూ కలిసే ఉండేవారు. శ్రీ శేషుబాబుగారు శిష్యప్రేమతో తమ ప్రియశిష్యుడిని వదిలి ఉండలేకపోయేవారు. సత్యచింతనలో, సత్యబోధలో, ఆత్మవిమర్శలో ఎంతసేపు గడిపినను వారికి విసుగు, అలసట వచ్చేవి కావు. అంతకంతకు వారి సత్సాంగత్యకాలము పెరిగిపోసాగినది. రోజుకు పద్దెనిమిదిగంటల వరకు వారు కలసియేయుండి బయట తిరిగేవారు. ప్రతిరోజూ రామచంద్రపురములోని గుడులన్నింటికీ వెళ్ళేవారు, గుడులలో కొంతసేపు కూర్చునేవారు. మున్సిపల్ గ్రౌండులో చాలాసేపు కూర్చునేవారు. ఊరికి చివరగా ఉన్న పెద్దవంతెన వద్దకు వెళ్ళి, వంతెన ప్రక్కన ఉండే పంటపొలములలో ఏకాంతముగా చాలా సేపు కూర్చునేవారు. అర్ధరాత్రి సమయములో పార్కులో ఎవ్వరు ఉండరు కాబట్టి అర్ధరాత్రి సమయములో పార్కులోకి వెళ్ళి అక్కడ బెంచిపై చాలాసేపు కూర్చునేవారు. ఈ విధముగా ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభించి రాత్రి రెండు గంటల వరకు ఊరిలోని ఏకాంతప్రదేశాలలో కూర్చుంటూ నిరంతరాయముగా సత్యచింతనలో, సత్యబోధలో, ఆత్మవిమర్శలో నిమగ్నమైపోయియుండి సత్యసాధన చేసెడివారు. ఎప్పుడో అర్ధరాత్రి ఇంటికి వెళ్ళి మరల ఉదయమే బయటకు వచ్చేసేవారు. మరల మధ్యాహ్నం భోజనానికి వెళ్ళి కొద్ది సేపుండి మరల వచ్చేసేవారు. ఇంట్లోని సభ్యులకు వీరు కనిపించడమే గగనమైపోయేది. వీరి సత్యచింతనలో వీరు నిమగ్నమైయుండేవారే గానీ ఎవ్వరినీ పట్టించుకునేవారు కాదు. చూచేవారు అందరు వీరిద్దరికీ భక్తిపిచ్చి పట్టుకున్నదేమో అనుకునేవారు. ప్రతిరోజూ అంతసేపు మాట్లాడుకోవడానికి ఏముంటాయి? అని ఆశ్చర్యపోయేవారు. వీరిద్దరూ కొంతకాలానికి ఖచ్చితముగా సన్యాసులలో కలసిపోతారని అనుకునేవారు.

continue...

శ్రీ శేషబాబు గారి యందు ఆత్మవిమర్శ, జాలితో పాటుగా వైరాగ్యము అనే దైవీశక్తి కూడా సంపూర్ణముగా మేల్కొనియున్నారు. శ్రీ శేషబాబు గారు తన జీవిత కాలమంతటిలో అన్ని పరిస్థితులలోను ఎల్లప్పుడూ మనస్సంతా వైరాగ్య భావనలతోనే నిండియుండేవారు. ఇప్పటి కాలప్రభావమును బట్టి మానవుని ఆయుఃప్రమాణమును అరవై సంవత్సరములుగ భావించెడివారు. తన ఆయుష్షును గూర్చి, మరణమును గూర్చి ప్రతిక్షణము లెక్కిస్తూ ఉండెడివారు. ఇరవైయ్యేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు, అరవై ఏళ్ళలో మూడవ వంతు కాలము కరిగిపోయినది. గడిచిపోయిన దానిని ఒక రోజుగా భావిస్తే ఇంకొక రెండు రోజులలో నా ఆయుష్షు పూర్తిగా కరిగిపోతుంది కదా ! అని యోచించేవారు. ముప్పైయ్యేళ్ళ వయసులో ఉన్నప్పుడు ఒక రోజు గడిచిపోయినది, ఇంకొక్కరోజు గడిస్తే చాలు నా ఆయుష్షు తీరిపోతుంది కదా ! అని యోచించేవారు. నలభై ఏళ్ళ వయసులో ఉన్నప్పుడు అప్పుడే రెండురోజులు గడిచిపోయినవి ఇంకొక్క రోజే మిగిలినది ఇంకొక్క రోజులో నా ఆయుష్షు తీరిపోతుంది. తరువాత ఈ దేహముతోగానీ, ఈ బంధాలతోగానీ, ఈ సంపదలతో గానీ నాకెటువంటి సంబంధము ఉండదు. లోకములో అందరూ అన్నింటికంటే ఎక్కువగా తమ దేహమును ప్రేమిస్తారు. ఆయుష్షు తీరిపోగానే ఈ దేహాన్ని తీసుకువెళ్ళి కట్టెలపై పెట్టి కాల్చివేస్తారు. చివరకు పిడికెడు బూడిద తప్ప ఇంకేమి మిగలదు. బ్రతికి ఉన్నంతకాలము ఈ దేహమునకు ఎన్నో అలంకారములు చేస్తాము, ఎన్నో రుచులతో ఈ దేహాన్ని సుఖింపచేస్తాము. ఎన్నో కీర్తి ప్రతిష్టలతో, ఎన్నో వినోదములతో ఈ దేహమును ఎంతో ఆనందింపచేస్తాము. కానీ ఆయుష్షు తీరిపోగానే ఈ దేహముతో మనకెట్టి సంబంధము ఉండదు. ఈ దేహము పూర్తిగా మట్టిలో కలిసిపోతుంది కదా అని ప్రతిక్షణము ఆలోచిస్తూనే యుండేవారు. ప్రతిరోజు, ప్రతినెల ఇంకా ఎన్ని రోజులు, ఇంకా ఎన్ని నెలలు మిగిలి ఉన్నాయి అని ఆలోచించుకుంటూ ఆ తరువాత ఈ దేహము మట్టిలో కలిసిపోతుంది కదా ! ఈ దేహ బంధాలన్నింటితో సంబంధము పూర్తిగా పోతుంది కదా ! అని యోచిస్తూయుండేవారు. ఎన్ని బాహ్య పరిస్థితుల మధ్య ఉన్నను జీవితమంతా ఆయన ప్రతిక్షణము తన దేహము కట్టెలపై కాలిపోవుచున్నట్లుగా, మట్టిలో కలిసిపోవుచున్నట్లుగా స్మరించుకుంటూ మృత్యువును అనుభూతి చెందుచూ అంతరంగమంతా వైరాగ్య భావనలతో నిండిపోయి యోగివలెనే జీవించెడివారు. లోకములో అందరూ అందచందములకు గొప్పగా విలువనిస్తూ ఆకర్షితులగుచుంటారు.

continue..

కానీ అందముగాయున్నను అన్ని దేహములలోను ఉండేది చీము, నెత్తురులే కదా! అందరి దేహములలోను మలమూత్రములే ఉత్పత్తి అవుతాయి కదా! ఇటువంటి అసహ్యకరమైన దేహములను గూర్చి స్త్రీల యెడల పురుషులు, పురుషుల యెడల స్త్రీలు ఎందుకు వ్యామోహము చెందుచూ ఆకర్షింపబడుచున్నారు? అని ఎల్లప్పుడూ యోచించుచూ శ్రీ శేషబాబు గారు దేహ వ్యామోహములను వదిలివేసేవారు.

మనుష్యులందరూ ఎన్నోఆశలతో, ఎన్నోకోరికలతో ఏవేవోలక్ష్యాలు నిర్దేశించుకుంటూ వాటిని సాధించుటకు ఎన్నోపథకాలు వేసుకుంటూ ఉంటారు. ఒక లక్ష్యము నెరవేరిన తరువాత మరొక లక్ష్యమును ఏర్పాటు చేసుకుంటూ జీవితమంతా గడిపేస్తారే గానీ మనుష్యులందరికీ తప్పనిసరిగా అంతిమ లక్ష్యమగు మరణమును గూర్చి ఎవ్వరూ అలోచించరు బాల్యములో అందరూ మంచి చదువులు గొప్పగా చదవాలనుకుంటారు. ఆ లక్ష్యము నెవేరిన తరువాత మంచిఉద్యోగము రావాలి అనుకుంటారు. ఆ లక్ష్యము నెరవేరిన తరువాత మంచిజీవితభాగస్వామిని పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. ఆ తరువాత మంచిపిల్లలను కనాలనుకుంటారు. ఆ తరువాత మంచిఆస్తులను సంపాదించాలనుకుంటారు. ఆ తరువాత పిల్లలను ఉన్నతస్థాయిలో స్థిరపడేలా తీర్చిదిద్దాలనుకుంటారు. ఆ తరువాత వృద్ధాప్యములో లోటులేకుండా గొప్పగా ప్రశాంతముగా గడపాలనుకుంటారు. ఈ తరువాత మట్టిలో కలిసిపోతారు. అంతే కదా ఎవ్వరు ఎన్నిలక్ష్యాలు, ఎన్నిపథకాలు ఏర్పరచుకున్నా అందరి చివరిలక్ష్యము మాత్రము మరణమే. చివరకు ప్రతి ఒక్కరు మట్టిలోనే కలిసిపోతారు.

మనముందు ఉన్నవారందరూ మట్టిలో కలసిపోయినారు. మనము కూడా మట్టిలో కలిసిపోక తప్పదు. అనే సత్యము ఇంత ప్రత్యక్షముగా కనిపిస్తున్నాగానీ ఎవ్వరూ దానిని చూడకుండా ఏవేవో పథకాలు వేసుకుంటూ కూర్చుంటారు. తమకసలు మరణమే రాదన్నట్లుగా, ఈ భూమి మీదనే శాశ్వతముగా ఉంటామన్నట్లుగా అనేక బంధాలలో మునిగిపోయి ఉంటారు. వంద సంవత్సరాల జీవితమని మరిచిపోయి వేల సంవత్సరాలకు సరిపడా సంపదలను కూడబెట్టుకుంటూ, వాటిని అనుభవిద్దామని ఆశపడుతూ ఉంటారు. తప్పనిసరియైన మృత్యువును గూర్చి ఎవ్వరూ స్మరించుకోరు. మృత్యువు వచ్చినపుడు మనము కూడబెట్టిన దానిలో ఒక్క పూచికపుల్లనైనా మనవెంట తీసుకుని వెళ్ళలేము. సంపదలను, బంధువులను అన్నింటినీ ఇక్కడే వదిలేసి ఒట్టిచేతులతో ఈ లోకము నుండి వెళ్ళిపోతాము అనే వైరాగ్య భావనలను శ్రీ శేషబాబు గారు అనుక్షణము యోచిస్తూ లోకబంధముల యెడలగానీ, లోక సంపదల యెడలగానీ ఎట్టి వ్యామోహము లేకుండా జీవించేవారు. లోకములో ఉన్ననుగానీ తామరాకుపై నీటి బిందువువలె లోకమును మనస్సుకు అంటకుండా జీవించేవారు.

continue...

ఈ దేహము యొక్క మూలమును గూర్చి ఎల్లప్పుడు శ్రీ శేషుబాబు గారు ఈ విధముగా యోచిస్తూయుండేవారు. మట్టిలో పడిన ఒక విత్తనము మట్టి యొక్క సారమును గ్రహించి మొలకెత్తుచున్నది. మట్టి యొక్క సారమే మొక్కగా, ఆహార ధాన్యముగా, ఫలములుగా రూపాంతరము చెందుచున్నది. మట్టి యొక్క రూపాంతరమగు ఆహారమును మనిషి భుజించుచున్నాడు. ఆ ఆహారమే మనిషి ఉదరములో చేరి, రక్తముగాను, వీర్యముగాను రూపాంతరము చెందుచున్నది. అట్టి వీర్యము కలయిక ద్వారా మానవదేహము తయారగుచున్నది, పుట్టుచున్నది. మట్టి యొక్క రూపాంతరము నుండి అనగా మట్టి నుండియే మానవదేహము ఉత్పత్తి చేయబడుచున్నది. ఈ దేహము అరవై సంవత్సరాలో, వంద సంవత్సరాలో అనేక రకాలైన ఆటలు ఆడుచున్నది. ఆ తరువాత మరల ఈ దేహములన్నీ అగ్నిలో కాల్చబడిగానీ, మట్టిలో పూడ్చబడిగానీ మరల మట్టిలోనే కలిసిపోతున్నవి. మట్టిలో నుండి ఉద్భవించిన దేహము చివరకు మరల మట్టిలోనే కలిసిపోవుచున్నది, శాశ్వతముగా ఉన్నది మట్టియే. ఈ దేహములన్నియు తాత్కాలికమైనవే. ఒక గారడీవాడు తెల్లకాగితాన్ని తీసి దానిని వంద రూపాయల కాగితములాగ మార్చివేస్తాడు. దానిని కొంతసేపు అందరికీ చూపించి అందరినీ ఆశ్చర్యపరచి మరల దానిని తెల్లకాగితములాగ మార్చివేస్తాడు. శాశ్వతముగా ఉండేది తెల్లకాగితమే, వందనోటు అనేది తాత్కాలికమే. అలాగే వంద సంవత్సరాల క్రితము మన దేహము లేదు, వంద సంవత్సరాల తరువాత మన దేహము ఉండదు. అనంతమైన కాలగమనముతో పోల్చుకుంటే ఈ దేహజీవితము చాలా స్వల్పమైనది. అట్టి తాత్కాలికమైన దేహమే శాశ్వతమనుకుంటూ దేహసంబంధమైన మమకార వ్యామోహములలో అభిమాన ద్వేషములలో మునిగిపోవుట అవివేకమే అగుచున్నది. ఈ దేహ జీవితమును అతి స్వల్పమైన తాత్కాలికమైన మజిలీయేనని గ్రహించాలి శాశ్వతమైన ఆత్మజీవితమును గుర్తించాలి. పరమాత్మను అన్వేషించుచూ, నమ్ముచూ, అనుసరించుచూ, స్మరించుచూ, కీర్తించుచూ శాశ్వతమైన ఆత్మలాభమును సంపాదించుకొనుటకు ప్రయత్నించాలేగానీ దేహ సంబంధమైన ఎన్ని సంపదలు, ఎన్ని లాభములు సంపాదించుకున్నాగానీ అవన్నీ వ్యర్థమైనవే అనేటటువంటి వైరాగ్య భావనలు ఎల్లప్పుడూ, అనుక్షణమూ యోచిస్తూ, ప్రతిక్షణము తన దేహమును మట్టిలాగే చూస్తూ ఉండేవారు. ఆ విధముగా వైరాగ్యము సంపూర్ణముగా మేల్కొనియున్న శ్రీ శేషుబాబు గారిని ఎప్పుడూ ఎట్టి మాయాబంధములు ఏ మాత్రము బంధించలేవు. ఆయనలో ఎవ్వరి యెడల ఎట్టి అభిమాన ద్వేషములుగానీ, కోపతాపములు గానీ కలుగవు. సద్గురుశక్తి ప్రభావము చేత ఇతరులకు సద్గురుసేవ చేయుట కొరకు ఆయన దేహము ఎన్ని విధములుగా ప్రవర్తించుచున్నను గానీ, ఆయన మనస్సు మాత్రం ఎల్లప్పుడూ సంపూర్ణ వైరాగ్యముతో నిండియుండి యోగివలె జీవించిన సంపూర్ణ వైరాగ్య స్వరూపుడు శ్రీ శేషుబాబు గారు.

*******